# పురుగు

ప్రభుత్వ కంపెనీలో ఉన్నతోద్యోగి వీరేశం. ఉన్నత విద్యావంతుడు కూడా... తన పిల్లలను డాక్టర్, కలెక్టర్‌గా చూడాలన్నదే అతని ధ్యేయం. అతని కళ్ళముందు డాక్టర్, కలెక్టర్ రూపాలు, అతని నోట్లో ఆ రెండు పదాలే కదులుతుంటాయి. అందుకోసం ఆఫీసునుంచొస్తూనే పిల్లలను దగ్గర కూచోబెట్టుకొని చదివిస్తుంటాడు. పిల్లలను చదివించడమనే విషయాన్ని తప్ప ఇంట్లో మరే విషయాన్నీ పట్టించుకోడు.

రోజూలాగే ఆఫీసునుంచొచ్చిన తర్వాత స్నానం చేసి టీ తాగాడు... పడక కుర్చీలో కూచున్నాడు. అతని ప్రక్కనే నేలమీద కిరణ్, కవితలున్నారు. వాళ్ళ చేతుల్లో పుస్తకాలున్నాయి. 'యముండ' అన్నట్టు కూర్చోనున్న తండ్రిని భయంభయంగా చూస్తూ చదువుకుంటున్నారు వాళ్ళిద్దరు. ఆ పిల్లలకు నాన్నంటే ఎంతో ఇష్టం... ప్రాణం కంటెక్కువే... వీరేశం వాళ్ళకు ఏదడిగితే అది కొనిస్తాడు... వాళ్ళతో ఎంతో చనువుగా ఉంటాడు... పసిపిల్లవాడిలా ప్రవర్తిస్తాడు. అలాంటి నాన్న, అన్ని విషయాల్లోనూ ఓ స్నేహితుడిలా ప్రవర్తించే నాన్న చదువు విషయంలో ఛండశాసనుడిలా ప్రవర్తించడం ఆ పసివాళ్ళకు మింగుడుపడటంలేదు. తాను చదువమన్నది పూర్తిచేయకుంటే చావబాదుతాడు. రాయమన్నది రాయకుంటే ఒళ్ళు హూనం చేస్తాడు. అప్పుడప్పుడే కొంత ఆలోచించే వయసులోకి అడుగుపెడ్తున్న కిరణ్, కవితలకు తండ్రి ప్రవర్తన అర్థంకావడంలేదు.

తేపకోసారి తండ్రి దిక్కు చూస్తూ చదువుకుంటున్నారు పిల్లలిద్దరూ. వాళ్ళు సరిగ్గా చదువుతున్నారో లేదో ఓరగా గమనిస్తూ ఆలోచిస్తున్నాడు వీరేశం. కొద్దికాలంగా వీరేశంలో సంఘర్షణ చెలరేగుతుంది.

"కిరణ్...! సెట్స్, చాప్టర్ ప్రాబ్లమ్స్ పూర్తిచేయి... 8 వ తరగతిలో కంటే తొమ్మిదో తరగతిలో లెక్కలు కఠినమైనవి. నిన్న చెప్పింది అర్థమైంది కదా...! లెక్కల్చేయి...రానియి నన్నడుగు..." అన్నాడు కిరణ్ దిక్కు చూస్తూ వీరేశం...

"అర్థమైంది నాన్నా...! కాని, మాథ్స్ బోర్. నేను వేరే చదువుకుంటాను..." అన్నాడు కిరణ్.

వీరేశం ముఖంలో ముడుతలు పడ్డాయి...కొద్ది క్షణాలాగి "నేను చెప్పింది చెయ్యి... లెక్కల్లో ఇంటలిజెంటయితే, లెక్కలు బాగా చెయ్యగలిగితే మిగతా సబ్జెక్టులన్నీ అంత కష్టం కావు. లెక్కలు బాగా చేయడం వల్ల రీజనింగ్ పవర్ పెరుగుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నువ్వింకా హార్డ్‌వర్క్ చేయాలి... చేస్తే తప్పకుండా ర్యాంకొస్తుంది."

"నాన్నా! అందరికి రాంకులు రావడమెలా సాధ్యపడుతుంది...? అందరి నాన్నలూ ఇలాగే బలవంతం చేసి చదివిస్తున్నారనుకుందాం... లేదా, ట్యూషన్లు పెట్టి చదివిస్తారనుకుందాం...అందరూ బాగానే చదివినా ర్యాంకులొచ్చేది ఇద్దరు, ముగ్గురికే కదా...! మరి మిగతా వాళ్ళకు దెబ్బలేనా...?"

కిరణ్ ప్రశ్న విని నోరు తెరిచాడు వీరేశం... కొద్దిసేపాగి, "అందరు అలా ఏం చదివించరు... చదివించినా చదువందరికీ ఒంటబట్టదు. మీకు బాగా చదువుతే తప్పకుండా ర్యాంకులొస్తాయి. ఈ మధ్య కొంచెం చనువిస్తే చాలు అధిక ప్రసంగం చేస్తున్నావు. బాగా చదుకోమంటే గాడ్దలు కాసి బతకాల్సి వస్తుందన్న విషయం మరిచిపోకు..." అన్నాడు.

"ఇలా చదువుకోవడం కంటె గాడ్దుల కాసి బతకడమే నయం" తనలో తాననుకున్నాడు కిరణ్. ఇంకా ప్రశ్నలడుగుతే తండ్రి కోపానికొస్తాడని లెక్కలు చేయడంలో నిమగ్నమయ్యాడు.

"కవితా! నువ్వేం చేస్తున్నావు...?" కూతుర్నడిగాడు వీరేశం.

"సోషల్ చదువుతున్నాను..."

"నువ్వు సైన్సులో కొంత వీక్. ఈ సంవత్సరం నీకు కామన్ పరీక్ష ఉంటుంది. బాగా వర్క్ చేయాలి. ఎయిర్ పొల్యూషన్ లెసన్ చదువు. ఓ అరగంట తర్వాత ప్రశ్నలడుగుతాను..."

"ప్లీజ్... అంత తొందరగా కావు నాన్నా...!"

"నిన్ననే చెప్పాను కదా...! ఇంకా పూర్తిచేయలేదా...? సరే... గంట టైమిస్తున్నాను... పూర్తిచేయాలి..."

"అలాగే..." అని సైన్సు చదవడంలో నిమగ్నమైంది కవిత.

గంభీరంగా కూర్చొని పేపరు చదువుతున్న తండ్రి వాళ్ళకు యమకింకరుడులా కనబడ్తున్నాడు. కొద్ది నిముషాలు గడిచాయి...

"నాన్నా! అన్నయ్య రోడ్డుదిక్కు చూస్తున్నాడు... లెక్కలు చేయడంలేదు". కిరణ్ గూర్చి ఫిర్యాదు చేసింది కవిత.

పేపర్ కింద పడేసి పిల్లలిద్దర్నీ కోపంగా చూసాడు వీరేశం.

"నాన్న చెప్పినట్టు చదువుకోండ్రి... అత్తెసరు మార్కులతో పాసయితే ఈ కాలంలో అటెండర్ ఉద్యోగం దొరకడం కూడా కష్టమే..." వంటింట్లోంచి అక్కడికొస్తూ అంది వరలక్ష్మి.

"ఫస్టుగా పాసైతే కలెక్టరు నౌకరొస్తదా అమ్మ...?" అన్నాడు కిరణ్.

"కిరణ్...! ఈ మధ్య నీ మాట లెక్కువవుతున్నాయి... అయినా పట్టుదలంటూ ఉంటే ఏదీ అసాధ్యం కాదు... ఓ పత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్న వ్యక్తి పట్టుదలతో చదివి ఐ.ఏ.ఎస్. పాసయ్యాడు... నాకంటె ముందు మా కుటుంబంలో చదువుకున్న వాళ్ళెవరూ లేరు. నేను నులక మంచం మీద కూచొని, గూట్లోపెట్టిన గుడ్డిదీపం వెలుతుర్లో చదువుకునేవాడ్ని... నేను చిన్నతనంలో పిప్పరమెంట్లు తింటే

ఎక్కువే. మీకేమో కాలు కిందపెట్టకుండా పెంచుతూ బాగా చదువుకొమ్మంటే కష్టమవుతుంది..." అన్నాడు వీరేశం.

"నాన్నా! ఇంట్లో టీ.వీ. ఉన్నా చూడొద్దు ఇంటికెవరైనా చుట్టాలొచ్చినా మేం చదువుకుంటూనే ఉండాలి. ఇంటికి అంకుళ్ళు ఆంటీలొచ్చినా లోపల కూచొనే చదువుకోవాలి. నువ్వు ఇలాగే చదువుకున్నావా నాన్నా...?"

చాలా రోజుల్నుంచి అనాలనుకున్న మాటలు అనేశాడు కిరణ్...

కొడుకు ప్రశ్న వీరేశంను ఆలోచనలో పడేసింది.

తాను చిన్నచిన్న వ్యవసాయపు పనులు చేస్తూ చదువుకునేవాడు. కబడ్డీ, వాలీబాల్ లాంటి ఆటలు ఆడుకునేవాడు. తన తండ్రి తన నెప్పుడూ చదువుకొమ్మని బలవంతం చేయలేదు. అప్పుడింత ఆరాటం లేదు. అపేక్ష లేదు. ఇంజనీరో, డాక్టరో కావాలన్న పట్టుదల లేదు. కానిప్పుడు...? పోటీ... పోటీ... పోటీ భయంతో తాను పిల్లల్ని అన్నిటికీ దూరం చేస్తున్నాడా...?

కిరణ్ కేం సమాధానం చెప్పాలో కొద్ది క్షణాలు తోచలేదు వీరేశంకు.

"కిరణ్... నువ్వీమధ్య అతిగా మాట్లాడుతున్నావు. మిమ్మల్ని అసలే ఆడుకోవద్దని అన్నానా...? అప్పుడప్పుడు ఆడుకుంటానికి పంపిస్తూనే ఉన్నాను గదా! అయినా ఆటలవల్ల వచ్చేదేంటి...? నీకు క్రికెట్ ఆడటం ఇష్టం. మంచిదే... మరి నువ్వా ఆటాడి సచిన్‌లా పేరు తెచ్చుకుంటావా...? ఇక్కడుంటూ అలా ఎదగడం సాధ్యంకాదు. అలాంటప్పుడు ఈ ఆటలవల్ల దేనికీ కాకుండా అయిపోయే ప్రమాదముంది. ఇక్కడుండి కూడా బాగా చదివితే ఏదైనా సాధించవచ్చు..." అన్నాడు వీరేశం.

"కొంచెం అలుసిస్తే చాలు. నెత్తికెక్కి కూర్చుంటారు. నాన్న అనుభవాలతో చెబుతున్నాడు. వినకుంటే మీకే నష్టం. సమయం చాలా విలువైంది. గడిచిపోయిన సమయం తిరిగిరాదు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. చదువుకోండ్రి..." అంది వరలక్ష్మి.

"అమ్మా! నాన్నను టైమ్ గూర్చి ఉపన్యాసమియ్యమనకు... చచ్చిపోతాం..." అంది నవ్వుతూ కవిత.

"బాతాఖానీ చాలుగాని చదువుకోండ్రి..." వీరేశం గద్దరించినట్టనగానే చదువులో నిమగ్నమయ్యారు వాళ్ళు... తండ్రి ముఖం సీరియస్‌గా మారడం చూసి కిరణ్ తాననబోయే మాటలను మింగేసాడు...

కిరణ్ లెక్కలతో తంటాలు పడుతుంటే కవిత గాలి కాలుష్యం గూర్చి చదువుతుంది.

వాళ్ళను గమనిస్తూ కుర్చీలో జారగిలబడ్డాడు వీరేశం.

జీవితంలో ప్రవేశించే ముందు ఏమనుకున్నాడు తాను...? తనకెన్ని ఆదర్శాలుండేవి...? తన పిల్లలను ఆదర్శవంతులుగా తీర్చిదిద్దాలనుకున్నాడు. ఫ్రీబర్డ్స్‌లా పెంచాలనుకున్నాడు. సామాజిక అవగాహన కల్గించే మంచి విద్యావంతులను చేయాలనుకున్నాడు. తాను జీవితంలో అనుభవించిన ఏ లోటుపాట్లూ తెలియకుండా

పెంచాలనుకున్నాడు. ముఖ్యంగా వాళ్ళు కోరుకున్న, వాళ్ళకిష్టమైన విద్యనే నేర్పించాలనుకున్నాడు. కాని, ఏమైంది...?

తన ఆశయాలకు ఆదిలోనే హంసపాదెదురైంది.

తన పిల్లలను మాతృభాష బోధనా భాషగా ఉన్న పాఠశాలలో వేస్తానన్నాడు.

"ఏ విషయాన్నైనా బాగా అర్థం చేసుకోవడానికిక మాతృభాషలో విద్యాబోధన అవసరం. ఎంతైనా విదేశీ భాష విదేశీ భాషే. పిల్లలను తెలుగుమీడియంలో చదివించాలనుకుంటున్నాను..." అన్నాడు వీరేశం.

ఆ మాటలు విని మిత్రులంతా ఫకాఫకా నవ్వారు.

భార్య కూడా హేళన చేసింది.

"నీకేమైందని పిల్లలను అలాంటి పాఠశాల్లో వేస్తానంటున్నావు? మనకు మంచి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో చదివించే అవకాశం ఉంది కదా! మనముంటున్నది ఇంగ్లీషు మీడియం పాఠశాలలు లేని పల్లెటూరు కాదు కదా...! ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో, తెలుగుమీడియం స్కూళ్ళల్లో ఎవరు చదివిస్తున్నారు...? ఆ బళ్ళను పట్టించుకునేదెవ్వరు...? ఆర్థికంగా బీదరికంలో ఉన్నవాళ్ళో, ఇంగ్లీషు మీడియం పాఠశాలలసలే లేనిచోటో ఆ బళ్ళలో చదివిస్తున్నారు... మనముంటున్న చోట తెలుగుమీడియంలో చదివిస్తే పిల్లలను చులకన చేస్తున్నారు. పోగా, మంచి స్థితిలోకి పోవాలంటే ఇంగ్లీషు మీడియంలోనే చదవాలి. కాంపిటేషన్‌ను తట్టుకునే అన్ని పుస్తకాలు తెలుగులో లేవు..."

మిత్రులన్నారు... దాదాపవే మాటలు వరలక్ష్మి అంది.

"తెలుగు మీడియంలో చదివి డాక్టర్లు, కలెక్టర్లు, ఇంజనీర్లు కావడంలేదా...? విషయాన్ని మరింత అవగాహన చేసుకుంటానికి మాతృభాషలో చదవడమే మంచిది" అన్నాడు వీరేశం.

"మీరెన్నైనా చెప్పండి" తెలుగు మీడియం చదివిస్తూ పిల్లలను ఇన్‌ఫిరియారిటీకి గురిచేయడం నాకిష్టంలేదు... భవిష్యత్తులో పిల్లలు మనల్ని వేలెత్తి చూపకుండా ఉండాలి. పల్లెటూళ్ళలో ఉంటున్న వాళ్ళు కూడా వేలాది రూపాయలు పెట్టి కాన్వెంట్లలో చదివిస్తుంటే మన దగ్గరున్న స్కూల్లో మీరు తెలుగుమీడియం చదివిస్తానంటారెందుకు...? మన పిల్లలను ఉన్నతోద్యోగాల్లో చూడటం మీకిష్టం లేదా...?" అంది వరలక్ష్మి.

వీరేశం మిత్రులు కూడా వరలక్ష్మినే సమర్థించారు.

"ఉన్నత స్థితి అంటే బాగా సంపాదించడమేనా? పెద్ద ఉద్యోగమేనా?"

"కాకుంటే ఏంటి? కాగితాలు ఖరాబు చెయ్యడమా? డిగ్రీల మీద డిగ్రీలు సంపాదించడమా? కూడబెట్టని ఏ చదువైనా, పనయినా దండగే. నా కొడుకును కలెక్టరును చేయాలి. నా బిడ్డను డాక్టర్ను చేయాలి. మనకు పట్టుదలలంటూ ఉంటే ఇవి సాధ్యంకాని విషయాలేం కావు. మొదట్నుంచి ప్రయత్నం జరగాలి. రెడ్డి ఓ

కొడుకును ఇంజనీర్‌ను, మరో కొడుకును డాక్టర్ను చేయాలనుకొని చదివించాడు. వాళ్ళు అయ్యారా, కాలేదా?" అంది వరలక్ష్మి.

అతడు పిల్లలను చదివించిన విధానం వీరేశంకు తెలుసు.

"పిల్లలను బాల్యంలో ఉండాల్సిన ఆటపాటలకు దూరంచేసి, స్నేహితులకు, బంధువులకు, సరదాలకు, సంబరాలకు దూరం చేసైనా సరే చదివించాలంటావు. పసివాళ్ళపై అంత భారం మోపడం ఏం బాగుంటుంది...?"

వీరేశం వాదన నెవరూ సమర్థించలేదు.

ఎన్నో విధాలుగా తర్జనభర్జనలు చేసుకున్నాడు వీరేశం. పరిస్థితులను అవగాహన చేసుకున్నాడు. చుట్టూ జరుగుతున్న విషయాలను మననం చేసుకున్నాడు. ఎంతో మంది విద్యావేత్తల ఫిలాసఫీలను చదివినప్పటికీ పొట్టకూటికే చదువన్న వాదంవైపే వీరేశంను పరిస్థితులు లాక్కెళ్ళాయి. పసి మనసుల్లో పోటీతత్త్వాన్ని పెంచుతూ చదువులకోసం వేలాది రూపాయలను ఖర్చుపెట్టే మనస్తత్వాలను చూస్తున్న వీరేశంకు తన ఆదర్శాలు అర్థం లేనట్టుగానే కనబడ్తున్నాయి... చదువువల్ల లభించిన ఉద్యోగంతో బాగానే బతుకుతున్న వీరేశంకు మిత్రుల వాదన, భార్య వాదన సరైనవే ననిపిస్తున్నాయి. పిల్లలను ఫ్రీబర్డ్స్ అని మరేదోలా అంటూ పెంచడం విచ్చలవిడితనమే ననిపిస్తుం దిప్పుడతనికి. నిర్బంధంగానైనా సరే వాళ్ళను ఉన్నతోద్యోగంలో కూర్చుండబెట్టడమే మంచిదనిపిస్తుందతనికి. మధ్యతరగతి బతుకు భయం వీరేశం మొదటి ఆదర్శాలను పూర్తిగా మరిచిపోయేట్టు చేశాయి.

ఎలాగైనా సరే, తన కొడుకును కలెక్టరుగా, కూతురును డాక్టరుగా చూడాలన్న ధ్యేయంతో చదివిస్తున్నాడు వీరేశం. పరీక్షల్లో ర్యాంకులొచ్చినపుడు చిన్న చిన్న బహుమతులు కొనిస్తూ ప్రోత్సహిస్తున్నాడు. తక్కువ మార్కులొచ్చినప్పుడు కఠినంగానే దండిస్తున్నాడు.

ఏండ్లు గడుస్తున్నాయి. పిల్లలు మంచి మార్కులే తెచ్చుకుంటున్నారు.

ఈ మధ్య అప్పుడప్పుడు వెనుకకు తిరిగి చూసుకుంటున్నాడు వీరేశం.

పిల్లలు పాఠ్య పుస్తకాలకే పరిమితమవడం గమనిస్తున్నాడు.

అదీ తెలుగు మొక్కుబడికే అన్నట్టు చదవడం. మ్యాథ్స్, సైన్సు అంటూ వెంటబడటం చూస్తున్నాడు. ఇది కంప్యూటర్ యుగమని, ఎలక్ట్రానిక్స్ కాలమని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లెక్కలు, సైన్సు చదివించడానికే ప్రయత్నించడం వీరేశం దృష్టిని దాటిపోలేదు.

తన పిల్లలను పరిశీలనగా చూస్తున్న వీరేశంకు వాళ్ళు కుంచించుకుపోతున్నట్టని పిస్తుంది...

"నాన్నా! నాన్నా!" కిరణ్ మాటలతో ఈలోకంలోకొచ్చాడు వీరేశం.

ప్రశ్నార్థకంగా కొడుకు దిక్కు చూశాడు.

తండ్రికి విషయం చెప్పడానికి భయపడ్తున్నాడు కిరణ్.

"ఏంటి? ఏం చెప్పదల్చుకున్నావో చెప్పు...?" అన్నాడు వీరేశం.

"నాకు యూనిట్ టెస్ట్‌లో తక్కువ మార్కులొచ్చాయి..."

"తక్కువ మార్కులంటే ఎన్నో చెప్పు."

"యాభైకి ముప్ఫైమూడు..." భయంభయంగా చెప్పాడు కిరణ్.

కుర్చీలోంచి లేచి నిల్చున్నాడు వీరేశం. అతని ముఖం కోపంతో ఎర్రబడుతుంది. ఇంతవరకూ పిల్లల గూర్చే ఆలోచిస్తూ చిరాకుగానూ ఉన్నాడు.

"నీకేదంటే అది ఇస్తూ ఇన్ని అవకాశాలు కల్పిస్తూ చదివిస్తున్నదెందుకు? నీతో కూచొని చస్తున్నా, నీకొచ్చే మార్కులు ముప్పై మూడా? పెద్ద తరగతిలోకి వస్తున్నకొద్దీ చదువు ఎక్కువవడానికి బదులు తగ్గుతుంది. సిగ్గుందా ఈ మార్కులు తెచ్చుకుంటానికి?" అని తిడుతూ కిరణ్ తల వెంట్రుకలు పట్టి వీపులో దభీదభీమని నాలుగైదు గుద్దాడు. భోరున ఏడ్వబోతున్న కిరణ్‌తో –

"నోర్ముయ్... బయటకు ఏడ్పు వినబడితే చీరేస్తాను..." అని మళ్ళీ పడక కుర్చీలో కూర్చున్నాడు. రెండు చేతులతో తల పట్టుకున్నాడు.

కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు కిరణ్... పెల్లుబికి వస్తున్న దుఃఖాన్నాపుకుంటానికెంత ప్రయత్నించినా సాధ్యం కావడంలేదు. బయటకు ఏడ్పు వినబడకుండా చేసే ప్రయత్నంలో మరింత ఎక్కువ ఏడ్పొస్తుంది.

"బయటకు వినరావద్దని చెప్పానా...?" గద్దరించినట్టన్నాడు వీరేశం.

కిరణ్ ఏడ్పాపుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఇష్టమున్నట్టు కొట్టి ఏడువద్దంటే ఎట్లాగుతదేడుపు? ఇదంతెందుకు? చంపెయ్యలేవు పీడవోతది..." అని తానూ ఏడ్వడం మొదలుపెట్టింది కవిత. చెల్లెలు బయటకు ఏడ్వడం చూసి కిరణ్ భోరున ఏడ్వసాగాడు.

ఇద్దరినీ బుజ్జగించి ఊర్కొంచడానికి వీరేశంకు, వరలక్ష్మికి తలప్రాణం తోకకొచ్చింది.

పిల్లికూనల్లా కూచొని తండ్రిని భయంభయంగా చూస్తూ చదువుకుంటున్నారిద్దరూ.

ఈ మధ్య తనలో తాను ఘర్షణ ననుభవిస్తున్న వీరేశంకు పిల్లలను చూస్తే జాలి కలుగుతుంది. ఎగురుతూ, దుముకుతూ పెరగాల్సిన వయసులో పుస్తకాలకే అంకితమై బతుకుతుండట మతనికి బాధాకరంగా ఉంది. వీరేశంలో అంతర్మథనం కొనసాగుతుంది. 'పిల్లలను పుస్తకాల పురుగులను చేస్తున్న ఈ సమాజాన్ని ఏదో పురుగు తొలుస్తుంది... ఆ పురుగుకు మందు వేస్తే తప్ప పిల్లల్లో సంపూర్ణ వికాసం కలుగదు...' తనలో తాననుకున్నాడు...

అయినా తన మార్గాన్ని మార్చుకుంటానికి సిద్ధంగా లేడు వీరేశం... మార్చుకుందామంటే భవిష్యత్తు భయం రాకాసికోరలతో అతన్ని గజగజ వణికిస్తుంది.

● ఆదివారం 'ఆంధ్రభూమి', 21-7-96 ●

★ ★ ★